క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన పీసీసీ ఎన్నికల కమిటీ

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, సభ్యుడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి పుష్పలీల, ఎమ్మెల్సీ రాములునాయక్, ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, దివ్యవాణి చౌదరీ, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామిల బృందం శుక్రవారం కలిసింది. ఈ సందర్భంగా ఖమ్మం లోక్‌సభ ఎన్నికలపై సమీక్ష నిర్వహించి రఘురాంరెడ్డి గెలుపు ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని లేనిపక్షంలో ఈసీ తీసుకునే చర్యలకు బలి కావాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించి మాట్లాడిన మాజీ సీఎం కేసీఆర్‌ను ఈసీ 48 గంటలు నిషేధించిన విషయం అందరికీ తెలుసన్నారు.

1104 నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 ఖమ్మం ఎంఆర్‌ఐ డివిజన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎ.సన్యాసిరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జి.నర్సింహారావు, కార్యదర్శిగా టి.ప్రవీణ్‌రావు, ఉపాధ్యక్షుడిగా కె.చిరంజీవి, అదనపు కార్యదర్శిగా జె.ప్రసాద్, కోశాధికారిగా ఎం.నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి టి.శేషగిరిరావు, జీఎల్‌ఎన్ రావు, శ్రీనివాస్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ప్రగతి సాధ్యం

ఖమ్మంరూరల్: విద్యతోనే ప్రగతి సాధ్యమని సుడా డైరెక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సాయిగణేష్‌నగర్‌లో ఇంటర్మీడియేట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో నేడు ఉన్నతస్థాయిలో ఉన్న వారంతా విద్య వల్లనే సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిగణేష్‌నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోట్ల శ్రీనివాసరావు, ఎంపీటీ, రాజారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బంజారా బిడ్డను గెలిపిద్దాం..



సమావేశంలో మాట్లాడుతున్న బస్కీనాయక్, పక్కన రాంనాయక్

ఖమ్మంఅర్బన్: లోక్‌సభ ఎన్నికల్లో బంజారా బిడ్డ జోగ్ రాంనాయక్‌ను గెలిపించాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ బస్కీనాయక్ కోరారు. ఖమ్మంలోని బంజారా భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాంనాయక్‌ను గెలిపిస్తే బంజారాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ బిచ్చారావు, హలావత్, షీక్లానాయక్, బానోత్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బాపూ
వినోద	టిల్లు 2
సాయిరాం	ప్రసన్నవదనం
ఆదిత్య	శబరి
శ్రీనివాస	ఆ.. ఒక్కటి అడక్కు

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	24	పాలకూర	2
పచ్చిమిర్చి	54		10
కాకర	40	చుక్కకూర	2
బీర	46		10
దొండ	34	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	76	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	44	పుదీన	1
క్యాప్సికం	66		20

-ఖమ్మం వ్యవసాయం

మద్దులపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వా'డీలా'..!

తూతూమంత్రంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- చాలా చోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్న వైనం
- ఆటవస్తువుల పరిస్థితి అంతంతే..
- సిబ్బంది కొరతతో లబ్ధిదారులకు నిరాశ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఖమ్మంరూరల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంతో పాటు బాల్యం నుంచే చదువుపై ఆసక్తి కల్పించేలా ఆట,పాటలతో బోధించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కేంద్రాల్లో బోధించడానికి టీచర్ల కొరత సైతం వెంటాడుతోంది. కాగా, అద్దె భవనాల్లో అరకొర వసతులు వేధిస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

అధికారుల పర్యవేక్షణ లేక..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యాబోధన, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీపై పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. సీడీపీఓ, సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన కేంద్రాలను తనిఖీ చేయడంలో అలసత్వం వహిస్తుండడంతో అర్హులైన వారికి నష్టం జరుగుతోందని చెబుతున్నారు. అంతేకాక చాలాచోట్ల టీచర్లు సమయపాలన పాటించడం లేదని, ఇంకొన్ని చోట్ల సిబ్బంది కొరతతో కేంద్రాలు తూతూమంత్రంగా నడున్నాయనే విమర్శలున్నాయి. అయితే టీచర్లకు కేంద్రాల నిర్వహణే కాక ఇతర అదనపు బాధ్యతలు ఇస్తుండడంతో వారికి ఒత్తిడి పెరిగి ఎటూ న్యాయం చేయలేకపోతున్నారని తెలుస్తోంది. అలాగే, కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేస్తేనే లబ్ధిదారులకు సరైన సేవలందే అవకాశముంటుంది.

పాలేరు నియోజకవర్గంలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. అందులో ఖమ్మంరూరల్ కింద 68 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 20 మినీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటన్నింటిలో కలిపి 31 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తుండడం గమనార్హం. దీంతో కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి సరైన స్థలం లేక, ఒక వేళ స్థలం ఉన్నా.. ఆట వస్తువుల కొరతతో ఆటపాటలతో కూడిన బోధన అందడం లేదు. అంతేకాక తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ పరిధిలో 76 మెయిన్ కేంద్రాలు, 16 మినీ కేంద్రాలు ఉండగా.. మొత్తంగా 16 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రెండు ప్రాజెక్టుల్లో కలిపి 13,586 మంది పిల్లలు, 4,019 మంది బాలింతలు, గర్భిణులకు సేవలు అందుతున్నాయి. కాగా, కొన్నిచోట్ల కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ కూడా సరిగ్గా జరగడం లేదనే ఆరోపణలున్నాయి.

రెండు ప్రాజెక్టులు.. 47 అద్దె భవనాలు

ఆడుకునేందుకు వస్తువులేవి?

కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్య అందించాల్సి ఉండగా.. పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులే కరువయ్యాయి. జారుడు బల్లలు తదితరాలు ప్రభుత్వం సమకూర్చాల్సి ఉంది. కానీ, అధికారులు ఇవ్వకపోవడంతో ఆటలు ఆడించలేకపోతున్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ టీచర్లే సొంత ఖర్చులతో కొనుగోలు చేయడం లేదంటే.. దాతల చేయూతతో కొన్ని ఆట పరికరాలు సమకూర్చుకుని తూతూమంత్రంగా నడిపిస్తున్నారు.

ప్రభుత్వం నుంచే ఆగిపోయాయి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలపై ఓ అధికారిని వివరణ కోరగా.. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలకు కావాల్సిన ఆటవస్తువులు ప్రభుత్వం నుంచే రావడం లేదని తెలిపారు. దీంతో ఉన్న వాటితోనే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పుతున్నామని చెప్పారు. అలాగే, ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వం ఆదేశానుసారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

నేలకొండపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ బి.తిరుపతిరెడ్డి తెలిపారు. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు కేసులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం డివిజన్‌లో ఉన్న 21 సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా 190 లొకేషన్స్, 290 పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని,ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై తోట నాగరాజు, ఏఎస్సై కె.కోడేత్రాచు ఉన్నారు.

ఆదర్శ కమ్యూనిస్ట్ వెంకటరెడ్డి



నివాళులర్పిస్తున్న నారాయణ, తదితరులు

కూసుమంచి: పార్టీ కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన ఆదర్శ కమ్యూనిస్ట్ మండలంలోని గైగోళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ సీపీఐ నాయకుడు సంగబత్తుల వెంకటరెడ్డి అని సీపీఐ జాతీయ నాయకుడు డాక్టర్ కే.నారాయణ అన్నారు. వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. గురువారం గైగోళ్లపల్లిలో వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండు సురేష్, మండల కార్యదర్శి నర్సింహా, నాయకులు మల్లేష్, లింగయ్య, ఉపేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పాండురంగాచారి, శంకర్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశ అభివృద్ధి సాధ్యం



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ అన్నారు. గురువారం బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని 37వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. కేంద్ర నిధుల ద్వారా జిల్లా అభివృద్ధికి పాటుపడే తాండ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పద్మావతి, విజయలక్ష్మి, ధర్మేందర్, శ్రీనివాసరావు, తోట సతీష్, రామారావు, శ్రీలక్ష్మి, మారుతి, శేష ఫణికుమార్‌శర్మ, పసుమర్తి సంతోష్, ఆకుల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు డ్రెయినేజీ శుభ్రం..!



మట్టి తొలగించడంతో శుభ్రమైన డ్రెయినేజీ

మండలంలోని ఊట్కూర్‌లో జీపీ అధికారులు ఎట్టకేలకు డ్రెయినేజీలో మట్టిని తొలగించారు. గ్రామంలోని పాత జీపీ కార్యాలయం నుంచి ముత్యాలమ్మతల్లి ఆలయం వరకు డ్రెయినేజీలో మట్టి అంశంపై 'డ్రెయినేజీలో మట్టి తొలగించండి'అనే శీర్షికన ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో జీపీ అధికారులు డ్రెయినేజీలో మట్టిని తొలగించి శుభ్రం చేయించగా ఇదిగో ఇలా కనిపిస్తోంది.

– కామేపల్లి

సమాచారం

నేడు ఖమ్మంలో ఆర్‌ఆర్‌ఆర్ రోడ్ షో..

ఖమ్మంవన్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం నగరంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ షోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి తదితర ముఖ్యనేతలు పాల్గొంటారని టూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ రోడ్‌షో జెడ్పీ సెంటర్ మీదుగా బోనకల్ క్రాస్‌రోడ్డు, ముస్తఫానగర్, చర్చికాంపౌండ్, శ్రీనివాసనగర్ అయ్యప్ప స్వామి టెంపుల్ మీదుగా గాంధీచౌక్‌కు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

6న మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న సయ్యద్ హుస్సేన్

ఖమ్మంవన్‌టౌన్: నగరంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్పొరేటర్లు పాల్గొంటారన్నారు. ఈ సమ్మేళనంలో మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

6 నుంచి అయ్యప్ప ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని అయ్యప్ప ఆలయంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు చిల్లంచర్ల రాధాకృష్ణ, రాయపూడి వెంకటరమణలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలను సంప్రదాయ పద్ధతిలో ఆలయ తంత్రి టీకే దామోదరన్ తంత్రి, ఆలయ పూజారి పాకతిల్లం నారాయణ్ నంబూద్రిలు నిర్వహిస్తారని, కేరళ సంప్రదాయాలతో హక్షమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ప్రసాదరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన కూసుమంచి ఎంపీపీ, తదితరులు

కూసుమంచి/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: కూసుమంచి ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ, పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గురువారం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి సమక్షాన వీరు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయానికి కృషిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో చాట్ల పరుశురాం, బానోత్ రాంకుమార్, ముల్కూరి శ్యాంసుందర్‌రెడ్డి, బానోత్ నాగేశ్వరరావు, బానోత్ మమత, బదావత్ బీబ్లీ, బదావత్ మంగ్యా తదితరులు ఉన్నారు. ఇక నేలకొండపల్లి మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో శాఖమూరి రమేష్, బొడ్డు బొందయ్య, వంగవీటి నాగేశ్వరరావు, లక్కం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జై గౌడ్ నియోజకవర్గ కన్వీనర్ కాసాని సతీష్‌గౌడ్, పైనంపల్లి మాజీ ఎంపీటీసీ కుక్కల చంద్రయ్య సైతం కాంగ్రెస్‌లో చేరారు. కాగా, తిరుమలాయపాలెంకు చెందిన మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ తల్లి ప్రమీల ఇటీవల మృతిచెందడంతో ఆమె కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్‌తో పాటు స్వర్ణకుమారి, బాలసాని లక్ష్మీనారాయణ, నరేష్‌రెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల సమక్షాన కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి నాగేశ్వరరావు

రఘునాథపాలెం: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన గురువారం మండలంలోని వీఆర్.బంజర, రాంక్యాతండాకు చెందిన 70 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి మంత్రి పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ నంద్యా రమణ, రాములు, కొండలు తదితరులు ఉండగా, కార్పొరేటర్ మల్లీదు జగన్, గుత్తా వెంకటేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరే వారితో నష్టమే ఎక్కువ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్

రఘునాథపాలెం: ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నవారితో లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉన్నందున, చేరికల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మండలంలోని వీ.వీ.పాలెంలో గురువారం జరిగిన సమావేశంలో గ్రామ అధ్యక్షుడు బానోత్ కిషోర్, ఎంపీటీసీ యరగర్ల హన్మంతరావు, మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కాగా, ఇతర పార్టీల నుంచి వచ్చేవారి విషయంలో కార్యకర్తల ఇష్టం మేరకే నిర్ణయం ఉంటుందని తెలిపారు. నాయకులు కిలారు వెంకటరమణ, కుతుంబాక వెంకటేశ్వర్లు, బానోత్ రమేష్, ధరావత్ వీరూనాయక్, కుతుంబాక సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే పోటీ..



ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న రఘురాంరెడ్డి

ఖమ్మంరూరల్: ప్రజా సేవ కోసమే ఎంపీగా పోటీ చేస్తున్నానని తనకు భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. గురువారం పోలేపల్లిలో జరిగిన స్విమ్మర్ల అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తనను గెలిపిస్తే పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉంటానని, జిల్లాలోని మంత్రులు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో కలిసి పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, సౌజన్య, నర్సింహారావు, నరేందర్, గోవిందరావు, కె.గోపాల్‌రావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గురువారం ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆర్య వైశ్య సమ్మేళనంలో పాల్గొని మాట్లాడుతూ.. అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యాపార రంగానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, మహిళా జిల్లా నాయకురాలు దొబ్బల సౌజన్య, కొప్పుల చంద్రశేఖర్, మేళ్లచెర్వు వెంకటేశ్వర్లు, గోళ్ల భాస్కర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం వాయిదా



వేలం పాట నిర్వహిస్తున్న సమత

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి చెందిన భూములు సాగు కోసం నిర్వహించిన వేలం వాయిదా పడింది. గురువారం దేవాలయంలో 21 ఎకరాల భూమికి సంబంధించి దేవాలయ భూములను దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత ఆధ్వర్యాన వేలం పాట నిర్వహించారు. రైతులు పెద్ద మొత్తంలో వేలంలో పాల్గొన్నప్పటికీ వేలం పాటను వాయిదా వేయాల్సి వచ్చింది. గత ఏడాది కౌలుకు తీసుకున్న రైతులు వర్షాలు లేక పంటలు వేయలేదని, తాము కౌలు చెల్లించాలంటే ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మాఫీ ఇచ్చేందుకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ విషయంపై తామేమీ చేయలేమని అధికారులు తెల్చి చెప్పి పది రోజుల పాటు వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి దేవాదాయ శాఖ ఈఓ కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'యశోద'లో అత్యాధునిక వైద్యసేవలు



సమావేశంలో మాట్లాడుతున్న గోరుకంటి పవన్

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద ఆస్పత్రిలో అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాసరెడ్డి, చిదుర శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిపుణులైన వైద్య బృందంచే క్లిష్టపరమైన జబ్బులు, వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఎం.మణిశేఖరన్ ఆధ్వర్యాన నాలుగు నెలలుగా మలబద్ధకం సమస్యతో బాధపడుతున్న 60 ఏళ్ల వృద్ధుడికి అత్యవసర చికిత్స చేయగా ప్రస్తుతంఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా సమస్య నుంచి పూర్తిగా కోలుకున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 97057 71230, 99499 98378లకు సంప్రదించాలని సూచించారు.